క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఉంగుటూరు: కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయలని ఉంగుటూరు ఎంపీడీవో రాజు మనోజు అన్నారు. శనివారం ఉంగుటూరు మండలం చేబ్రోలు హైస్కూలులో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటి ఎంపీడీవో శ్రీనివాసు, సునీత టీచరు, పంచాయితీ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

భద్రతపై అవగాహన కల్పించాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ రాజశేఖర్

దెందులూరు: ప్రతి గ్రామంలోనూ మహిళా సంరక్షణ కార్యదర్శి భద్రతపై అవగాహన కల్పించాలని సీఐ సీహెచ్ రాజశేఖర్ అన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో మూడు మండలాల్లో అన్ని సచివాలయాల్లో పని చేస్తున్న మహిళా భద్రతా కార్యదర్శులకు దీపావళి పండుగ ప్రమాదాలు నిబంధనలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శివాజీ పాల్గొన్నారు.

అవగాహన సదస్సులు



మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్

దెందులూరు: బాలికలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేలా వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకోవాలని దెందులూరు సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ, పోతునూరు సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. శనివారం దెందులూరు, పోతునూరు గ్రామాల్లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవ అవగాహన సమావేశాలు నిర్వహించారు. మంచి చెడు ప్రవర్తన పరిశీలించాలన్నారు. రెండు గ్రామాల్లో ఉపాధ్యాయులు అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

హాస్టల్ ఏర్పాటుకు పరిశీలన



కళాశాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ విశ్వేశ్వరరెడ్డి

దెందులూరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో పరిశీలన చేశారు. ప్రిన్సిపాల్ ఎస్.నతానియేలు కళాశాలలో భవనాలు వసతులు చూపించారు. వ్యాయామ విద్య శిక్షణ పొందుతున్న బాలికల వివరాలు తెలిపారు. రాష్ట్రంలో ఏకైక ప్రభుత్వం వ్యాయామ విద్య కళాశాల గోపన్నపాలెం లో మాత్రమే ఉందని అన్నారు. వ్యాయామ కళాశాల వసతులు హాస్టల్ ఏర్పాటు నివేదికను జిల్లా కలెక్టర్, రాష్ట్ర కార్యదర్శి కి పంపుతామని డిప్యూటీ డైరెక్టర్ అన్నారు.

భీమడోలు ఎస్సై బాధ్యతల స్వీకరణ



భీమడోలు సీఐ విల్సన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సై షేక్ మదీనా భాషా

భీమడోలు: భీమడోలు ఎస్సై షేక్ మదీనా భాషా శనివారం నూతనంగా బాధ్యతలను స్వీకరించారు. ఏలూరు వన్‌టౌన్ ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై భీమడోలుకు వచ్చారు. గతంలో వీరవల్లి, ముగల్లూరు, ఏలూరు వన్‌టౌన్, టూ టౌన్, త్రీ టౌన్ ఎస్సైగా పని చేసారు. భీమడోలు సీఐ యూజే విల్సన్‌ను, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, రాష్ట్ర అప్కాబ్ గన్ని వీరాంజనేయులును ఆయన మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల ప్రజల సహాయ సహకారాలతో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇక్కడ పని చేసిన ఎస్సై వై.సుధాకర్ ఏలూరులోని వన్‌టౌన్ ఎస్సైగా రిపోర్ట్ చేయనున్నారు.

22న గౌరీదేవికి సారె సమర్పణ

దెందులూరు: పోతునూరులో గౌరీదేవి మహోత్సవాలు పురస్కరించుకుని ఈ నెల 22న గ్రామానికి చెందిన దాత ప్రసాద్ వల్లి దంపతులు సారె సమర్పిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలోని మహిళలు అమ్మవారికి గాజులతో ప్రత్యేక అలంకరణ చేస్తారని వివరించారు.

దీపావళి.. తస్మాత్ జాగ్రత్త!

- బాణసంచాతో ప్రమాదం
- సంప్రదాయ పద్ధతిలోనే పండుగ చేయాలి



ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు

పెదవేగి: వాస్తవానికి మన పండుగలు సంప్రదాయ పూర్వకమైనవి. వీటికి ఆధునిక విజ్ఞానం కొంత విదేశీ పోకడలు విజ్ఞానం తోడై కొన్ని ప్రమాదాలు విపరీతమైన పరిస్థితులు ఎదుర్కొనే విధంగా నేటి ఆధునిక పరిస్థితులు తయారయ్యాయి. ప్రధానంగా దీపావళి పండుగ ముందు ప్రమాదాలు, పండగ రోజు ప్రమాదాలు, పండగ తరువాత ప్రమాదాలు అన్న చందంగా మారింది. ఒకప్పటి దీపావళి మాదిరిగా నేటి దీపావళి లేదు. ఎంత ఎక్కువ పొగ, శబ్దం వస్తే అంత బాగా దీపావళి చేసినట్లు ప్రజలు లెక్క వేసుకుంటున్నారు. శబ్ద కాలుష్యం, వాతావరణ కాలుష్యం విపరీతంగా పెరిగిపోతుందని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నప్పటికీ ఎవరికి తోచింది వారు చేస్తున్నారు. దీనికి దీపావళి రోజు ఉపయోగించే పాశ్చాత్యపూరితమైన మందు సామగ్రి కార ణమని చెబుతున్నా ప్రజలు, యువతరం, ప్రమాదకరమైన వాటినే వాడుతూ ప్రమాదాలబారిన పడు తూ పర్యావరణానికి ప్రమాదం తెచ్చిపెడుతున్నారు. పర్యావరణాన్ని పాడు చేసే హక్కు ఎవరికీ లేదు. కడుపునింపని వాటికోసం ఆడంబరాలు, అర్థం లేని ఆలోచనలతో నలుగురిలో గొప్పకు మందుగుండు సామాను అధిక వ్యయం ఖర్చు చేస్తున్నారు. ఇలా చేస్తే కష్టపడిన సొమ్మును మన చేతులతో కాల్చేయడమేనని పలువురు మేథావులు అభిప్రాయపడుతున్నారు.

పండుగ రోజు పేదవారికి అన్నం పెడితే మేలు

పండగ రోజు నలుగురి పేదవాళ్లకి పట్టెడన్నం పెడితే పుణ్యం. టపాకాయలు కాలిస్తే ఆ పుణ్యం వస్తుందా? ఆకలితో ఉన్న వారికి సంతృప్తికరంగా భోజనం పెడితే ఆ తృప్తే వేరు. అది దైవ సేవతో సమానం. ఒక్కసారి ఆలోచించండి. అందరికీ దీపావళి శుభాకాంక్షలు. – కేశన సతీష్, గ్రామస్తుడు, వంగూరు

ఎవరికీ హాని కలుగకూడదు

దీపావళి అంటే వెలుగు నిచ్చే పండగ వెలుగులంటే దీపాలతో ఇవ్వాలే గాని, కాలుష్యంతో కాదు బాణసంచా వలన ఎక్కువగా వాయు, శబ్ద కాలుష్యం కలుగుతుంది. ప్రకృతిలో ఉండే స్వచ్ఛమైన గాలిని మనం కోల్పోతున్నాం. బాణసంచా వాడడం తగ్గించి వీలైనంత వరకు ఎవరికీ హానీ కలగకుండా పండుగ చేసుకోవాలి. – కట్టా ఏసుబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు, దెందులూరు

మనలో చెడును కాల్చేయాలి

దీపావళి అంటే చెడుపై మంచి గెలిచిన రోజు కేవలం టపాసులతో పండగను జరుపుకునే కంటే మనలో ఉన్న చెడును కాల్చేసి మంచిని వెలిగించే విధంగా చేసుకోవాలి. – సొంగ సోమయ్య, నాగన్నగూడెం, గ్రామస్తుడు

లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు

ఆ రోజు లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. దీపావళి ప్రారంభమైన అమావాస్య నుంచి మళ్లీ అమావాస్య వరకు నెల రోజులు దీపాలు వెలిగించడం ఆనవాయితీ, ఈ దీపాలు పితృ దేవతలకు దారి చూపుతాయని నమ్మకం. – మట్టా రాగిణి, ఎంపీటీసీ సభ్యురాలు, రాయన్నపాలెం

పర్యావరణాన్ని పరిరక్షించాలి



నడిపల్లిలో మొక్కలు నాటి నీరు పోస్తున్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

పెదవేగి: పెదవేగి మండలం నడిపల్లి కొత్తూరు కాలనీ, మెయిన్ సెంటర్ వద్ద శనివారం జిల్లా కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ రోజు స్వచ్ఛ గాలి థీమ్‌తో జిల్లాలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దీపావళికి వాతావరణం కలుషితం చేయని గ్రాకర్స్‌ను వాడాలని సూచించారు.

పెండింగ్ ఇళ్లు పూర్తి చేయాలి

మండలంలోని నడిపల్లి కొత్తూరు కాలనీలో శనివారం పలు దశల్లో ఉన్న గృహాలను స్వయంగా పరిశీలించి, లబ్ధిదారుల సమస్యలను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సాయంతో పాటు డ్వాక్రా సంఘాల్లో ఉంటే మరో రూ.35 వేలు సాయం తీసుకుని పూర్తి చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనంగా రూ.50 వేలు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. చిన్న పెండింగ్ ఇళ్లను పూర్తి చేసుకోలేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఈ గ్రామంలో 169 ఇళ్లు మంజూరు కాగా 79 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నారన్నారు. అయితే మిగిలినవి 90 ఇళ్ల నిర్మాణాలు పలు దశల్లో ఉన్నాయని ఈ నెల చివరికి పూర్తి చేయాలన్నారు. మన ।ఇల్లు – మన గౌరవం౹తో పూర్తి చేసుకుంటారనే ఆలోచనతో ఈ రోజు జిల్లా వ్యాప్తంగా 31 మెగా హౌసింగ్ డే అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామని, మిగిలిన 1695 గృహ నిర్మాణాలు పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నామని కలెక్టర్ అన్నారు. సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ పీడీ జి.సత్యనారాయణ, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ జి.త్రినాథబాబు, జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ, తహసీల్దార్ ఎస్‌డీ భ్రమరాంబ, ఎంపీడీవో కె.రవికుమార్, డీఈ టి.వివేకానందరావు, ఏఈ కె.ఉదయకిరణ్ పాల్గొన్నారు.

సీ, డీ గ్రేడు పిల్లలపై దృష్టి సారించాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న పెదపాడు మండల విద్యాశాఖాధికారి సబ్బితి నర్సింహమూర్తి

పెదపాడు: పాఠశాలల్లో సీ, డీ గ్రేడు పిల్లలపై దృష్టి సారించి, చదువుల్లో రాణించేలా కృషి చేయాలని పెదపాడు మండల విద్యాశాఖాధికారి సబ్బితి నర్సింహమూర్తి తెలిపారు. మండలంలోని పలు పాఠశాలలకు చెందిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో ఆంగ్లం, తెలుగు భాషల్లో చదవడం, రాయడం నేర్పించాలన్నారు. కార్యక్రమంలో వీరమ్మకుంట ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా పోటీలకు కొప్పాక విద్యార్థులు



ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం శైలజ, పీడీలు

పెదవేగి: ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కొప్పాక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆర్.శైలజ అన్నారు. పెదవేగి మండలం కొప్పాక ఉన్నత పాఠశాల్లో శనివారం జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ డివిజన్ స్థాయిలో నిర్వహించిన పలు రకాల పోటీల్లో మొత్తం 9 మండలాలనుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో 80 మంది వరకు యోగ సాధన పోటీల్లో పాల్గొనగా అండర్-14 విభాగంలో కొప్పాక పాఠశాలనుంచి ముగ్గురు విద్యార్థులు జిల్లా ఎస్‌జీఎఫ్‌కు ఎంపిక కావడంపై కె.తన్మయ్, ఎం.షణ్ముక్ ప్రియ, నితీష్‌లను, పీడీలను హెచ్‌ఎం శైలజ అభినందించారు. కార్యక్రమంలో పీడీలు దుర్గారాణి, మల్లిఖార్జున పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలి

ఉంగుటూరు: ప్రణాళిక ప్రకారం పనిచేస్తేనే ఇళ్ల నిర్మాణం పూర్తవుతుందని ఎంపీడీవో రాజ్‌మనోజు అన్నారు. చేబ్రోలులో నిర్వహించిన హౌసింగ్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్, హౌసింగు ఏఈ సతీష్, సర్పంచి లక్ష్మీసునీత, ఎ పి ఎం ప్రభావతి పాల్గొన్నారు.

డ్వాక్రా రుణం ఇప్పించండి

భీమడోలు: జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకోవాలంటే డ్వాక్రా సంఘాలకు బ్యాంకుల నుంచి రుణాలిప్పించాలని, లేని పక్షంలో కాంట్రాక్టర్‌తో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని లబ్ధిదారులు అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. భీమడోలు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం మెగా హౌసింగ్ డేను పురస్కరించుకుని ఇంకనూ ఇండ్లు నిర్మించుకోలేని లబ్ధిదారులతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ చైతన్యకృష్ణ, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, కార్యక్రమంలో పెద్దలు కుక్కల ప్రసాద్, పైడిమాల యుగంధర్, ప్రవీణ్‌కుమార్ పటేల్, గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ చందూ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

నిడమర్రు: గ్రామంలో 86 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని, వీటిని త్వరితగతిన పూర్తి చేయడానికి లబ్ధిదారులు అధికారులకు సహకరించాలని తహసీల్దార్ బి.ప్రసాద్ అన్నారు. శనివారం బువ్వనపల్లి గ్రామంలో నిర్వహించిన మెగా హౌసింగ్ మేళ నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో విజయకుమారి, హౌసింగ్ ఏఈ ఎస్.అలిముల్ల, సర్పంచ్ కిలారి సత్యవతి తదితరులున్నారు.

అవగాహన పెంపొందించుకోవాలి

దెందులూరు: గృహ నిర్మాణ లబ్ధిదారులు పథకంపై అవగాహన పెంపొందించుకోవాలని హౌసింగ్ డీఈ వివేకానంద, తహసీల్దార్ సుమతి, ఎంపీడీవో భీమరాజు, ఏపీవో సురేష్ అన్నారు. శనివారం దెందులూరు ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ డే సమావేశం నిర్వహించారు.

డివిజన్ స్థాయి పోటీల్లో విజయకేతనం



పెదపాడు: ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



నిడమర్రు: చైతన్యను అభినందిస్తున్న ఎంఈవో శేషగిరిరావు

పెదపాడు: డివిజన్ స్థాయి పోటీల్లో వీరమ్మకుంట హైస్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగరవేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో భాగంగా ఈనెల 17వ తేదీన గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో జరిగిన డివిజన్ స్థాయి పోటీల్లో వీరమ్మ కుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 5గురు విద్యార్థులు వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 బాలుర విభాగం వాలీబాల్ పోటీల్లో టి.సిద్ధూ, కబడ్డీ పోటీలో ఎం.గణేష్, గిరి హనుమాన్‌లు ఎంపికయ్యారు. 14 ఏళ్ల లోపు బాలుర విభాగం కబడ్డీ పోటీల్లో ఎం.వినీల్, బాలికల విభాగం కబడ్డీ పోటీల్లో వీ లాస్య ఎంపికై నట్లు ఫిజికల్ డైరెక్టర్ జి.మోహన్ తెలిపారు. 14 ఏళ్ల లోపు బాలుర విభాగంలో ఖోఖోలా ఆరుగురు బాలికల విభాగంలో ఇద్దరు అండర్ 17 విభాగంలో బాలురు ఇద్దరు, బాలికలు ఇద్దరు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు విజయ్‌కుమార్ చౌదరి, నాగేశ్వరరావులను విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తోట పుష్పావతి అభినందించారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు చైతన్య

నిడమర్రు: ఇటీవల గోపన్నపాలెంలో నిర్వహించిన కబడీ సెలక్షన్స్‌లో చానమిల్లి జెడ్పీస్కూల్ విద్యార్థి సి.నాగచైతన్య అండర్ 14 డివిజనల్ కబడ్డి జట్టుకు ఎంపికై జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు ఎంఈవో-2 యర్రంశెట్టి శేషగిరిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో -1 అనూరాధ, పీడీ పి.సౌజన్య, ఎస్ఎంసీ చైర్మన్ లక్ష్మీ భవాని తదితరులు చైతన్యను అభినందించారు.

న్యాయసేవ సహాయ కేంద్రం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మాధవి

గణపవరం: ప్రజలు తమ సమస్యలను పెద్దవిచేసుకోకుండా ప్రారంభదశలోనే పరిష్కరించుకుంటే సమాజంలో వైషమ్యాలు తగ్గడమేకాకుండా ఆర్థికంగా ఇబ్బందిపడే అవకాశం ఉండదని తాడేపల్లిగూడెం జిల్లాకోర్టు సీనియర్ సివిల్‌జడ్జి కె.మాధవి అన్నారు. శనివారం గణపవరంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో న్యాయ సేవా సహాయకేంద్రం(లీగల్ ఎయిడ్ క్లినిక్)ను ఆమెప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమెమ మాట్లాడుతూ ప్రజలకు న్యాయపరమైన సలహాలు ఈ కేంద్రం ద్వారా అందుతాయన్నారు. ప్రతి శనివారం కార్యాలయంలో న్యాయవాది ధనుకొండ సాయికుమార్ అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మూర అలంకారం, ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్ర, డిప్యూటి ఎంపీడీవో సత్యనారాయణ, తోటశ్రీన, జంపన వెంకటరామరాజు, సీతయ్య, వంటాకుల అప్పన్న, పంచాయతీ కార్యదర్శి శివరామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ కూటమికి గుణపాఠం



దెందులూరు: కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం

దెందులూరు: కోటి సంతకాల సేకరణతో కూటమి ప్రభుత్వానికి గుణపాఠమని జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం అన్నారు. శనివారం రాత్రి పెరుగ్గూడెంలో గ్రామ సర్పంచ్ ఎలమర్తి రేవతి రామకృష్ణ అధ్యక్షతన దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సూచన మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. జడ్పీటీసీ లీలా నవకాంతం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 15 నెలలుగా ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు నిర్ణయాలు చేస్తుందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శులు తొత్తడి వేదకుమారి, కట్ట ఏసుబాబు మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వలన రాష్ట్రంలో పేదలకు సకాలంలో ఉచితంగా విద్య వైద్యం శాశ్వతంగా దూరమవుతుందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి డీబీఆర్‌కే చౌదరి మాట్లాడుతూ కోటి సంతకాల సేకరణతో ప్రభుత్వం దిగి రావడం ఖాయం అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం తథ్యమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు అంగడాల సీతారావమ్మ, వేదనరావు పాలెం ఎంపీటీసీ అంగడాల వెంకటేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు వేమూరి జితేంద్ర, నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు యలమర్తి రామకృష్ణ, పార్టీ అధ్యక్షులు యలమర్తి సత్తిబాబు, జిల్లా కార్యదర్శి కొలుసు గణపతిరావు, బల్ల విజయకుమార్, పండు, చల్ల చింతలపూడి ఎంపీటీసీ సింహాద్రి శ్రీమన్నారాయణ, సీతంపేట సొసైటీ మాజీ చైర్మన్ నల్లూరు వెంకటరామయ్య (బాబి), సీతంపేట సర్పంచి పరసా వెంకట్రావు, కొవ్వలి కోఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ కొమ్మిన రాము, తొత్తడి కృష్ణ, నాగభూషణం, మండలంలో అన్ని అన్ని గ్రామాల నుంచి నాయకులు కార్యకర్తలు వైఎస్ఆర్ అభిమానులు హాజరయ్యారు.



పెదవేగి: కోటి సంతకాల సేకరణ ప్రారంభించిన ఎంపీపీ తాతా రమ్యశ్రీ

మార్పుకు సంకేతం

పెదవేగి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపుమేరకు జరుగుతున్న కోటి సంతకాల సేకరణ మార్పుకు సంకేతమని ఎంపీపీ తాతా రమ్యశ్రీ, పార్టీ మండల అధ్యక్షులు జానంపేట బాబు అన్నారు. శనివారం కన్నాపురంలో మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఆదేశాల మేరకు మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ జరిగింది. కార్యక్రమంలో వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ పార్టీ సీనియర్ నేత ముంగర సంజీవ్ కుమార్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మేక లక్ష్మణరావు, పార్టీ నాయకులు మేడికొండ కృష్ణారావు, తేజ, సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ మాజీ చైర్మన్లు, పార్టీ అన్ని విభాగాల నాయకులు కార్యకర్తలు వైఎస్ఆర్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఎంపీపీ తాతా రమ్య సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఎట్టకేలకు గుంతల పూడ్చివేత



గుంతల పూడ్చివేత పనులను పరిశీలిస్తున్న సర్పంచి షేక్ రహీమా బేగం

భీమడోలు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు భీమడోలు నుంచి ద్వారకాతిరుమల ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నారు. పలువురు గాయాల పాలైయ్యారు. ఇదే విధంగా పొలసానిపల్లి పంచాయతీ పరిధిలో రోడ్డు మధ్యలో భారీ గుంత ఏర్పడింది. ఈ క్రమంలో ప్రమాదాల బారిన పడకుండా పొలసానిపల్లి గ్రామ పంచాయతీ తగు చర్యలు చేపట్టింది. శనివారం సర్పంచి షేక్ రహీమాబేగం ఆధ్వర్యంలో రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులను కాంక్రీటుతో పూడ్చారు. గ్రామ కార్యదర్శి యు.జయరామకృష్ణ, పెద్దలు మద్దు శ్రీనుబాబు, సుభాని, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాన్ని పరిష్కరించేందుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు



గ్రామంలో మోహరించిన పోలీసులు

భీమడోలు: చెట్టున్నపాడులో చెరువుల లీజుల విషయంలో ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్ అన్నారు. కొల్లేరు గ్రామం చెట్టున్నపాడులో 200 ఎకరాల విస్తీర్ణంలోని చేపల చెరువుల లీజుల విషయంలో ఇరువర్గాల మధ్య నెలకొన్న వివాదం శాంతిభద్రతల సమస్యగా మారింది. దీంతో కొంత కాలంగా గ్రామంలో పోలీసులు పికెటింగ్‌లను ఏర్పాటు చేశారు. అయితే అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించేందుకు రెవెన్యూ, పోలీసులు ఉపక్రమించారు. దీంతో గ్రామంలో ఎక్కడా శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా భారీగా పోలీస్ బలగాలను మోహరించారు. చెట్టున్నపాడు గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద శనివారం ఇరు వర్గాల వారితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి తహసీల్దార్ బి.రమాదేవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్, ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ ప్రసాద్ తదితరులు ఇరు వర్గాలతో వారి సమస్యలపై చర్చించారు. ఇరు వర్గాల వారిని వేర్వేరుగా వారి నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరి వాదనలు వారు వినిపించారు. సమస్య కొలిక్కి రాకపోవడంతో ఇరువర్గాలు తమ అభిప్రాయాలను వినతుల రూపంలో అందజేయాలని ఆర్‌డీవో వారికి తెలిపారు. తొలుత కొల్లేరులోని చేపల చెర్వుల సర్వే నంబర్లు, వాటి మ్యాపులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. సమావేశంలో సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్, ఏఎస్సై చలపతిరావు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెదవేగి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఫోన్‌లో పరామర్శించారు. దెందులూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు యర్ర సురేష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలిసిన వెంటనే స్పందించిన దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, సురేష్‌తో, వారి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు.

దీపావళి వెలుగులు నింపాలి



దెందులూరు: దీపావళి పర్వదినం ప్రతి ఒక్క కుటుంబంలో వెలుగులు నింపాలని అందరూ సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో జీవించాలని గంగన్నగూడెం సాయి హైస్కూల్ కరస్పాండెంట్ బోయపాటి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం గంగన్నగూడెం సాయి హై స్కూల్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బోయపాటి సాయి ఉపాధ్యాయులు సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు దీపం ఆకారంలో ప్రదర్శన నిర్వహించారు.